క్లుప్తంగా

విద్య, వైద్యం, ఉపాధికి నిధులేవి?



కామారెడ్డి టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో విద్య, వైద్యం, ఉపాధికి సరిపడా నిధులు కేటాయించలేదని ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర నాయకులు లక్ష్మణ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. దేశంలో 80 కోట్ల పేదవారికి రేషన్ బియ్యం ఇస్తున్నారంటే దేశం ఎంత అభివృద్ధి చెందిందో అర్థమవుతుందన్నారు. ఈ బడ్జెట్‌తో పేదలకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. సమావేశంలో జిల్లా కన్వీనర్ బోలేశ్వర్, కో-కన్వీనర్లు అరవింద్, రాజు, పరశురాములు, రాజశేఖర్, కవిన్, రాజలింగం, లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులున్నారు.

పదవీ కాలం పూర్తయిన కౌన్సిలర్లకు సన్మానం



ఎల్లారెడ్డిరూరల్: ఐదేళ్ల పదవీ కాలం పూర్తయిన బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ మాజీ కౌన్సిలర్లను మాజీ జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి ఆదివారం సన్మానించారు. ప్రజలకు సేవ చేసినందుకు మున్సిపల్ మాజీ వైస్ చైర్‌పర్సన్ సుజాత, కౌన్సిలర్లు రాము, సాయిలు, జీనత్ సుల్తానాలను శాలువా, పూలమాలలతో సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు పొందాలని కోరారు.

రగ్బీలో రాష్ట్ర స్థాయికి ఎంపికైన సోమారంపేట విద్యార్థిని



మాచారెడ్డి: సోమారంపేట ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని సాహితి రగ్బీ ఆటలో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం భాస్కర్, పీడీ సంధ్య ఆదివారం తెలిపారు. ఈ నెల 1 నుంచి 3 వరకు మంచిర్యాలలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి రగ్బీ ఆటలో పాల్గొంటున్నట్లు వారు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థిని సాహితీని హెచ్ఎం, పీడీ, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. ఉపాధ్యాయులు సూర భాస్కర్, ఫిజికల్ డైరెక్టర్ సంధ్య, విద్యార్థినిని అభినందించారు. అలాగే అదే పాఠశాలకు చెందిన 9 మంది విద్యార్థులు తమిళనాడులో జనవరి 28 నుంచి ఈ నెల 3 వరకు జరుగుతున్న జాతీయ స్థాయి జంబోరీలో పాల్గొంటున్నట్లు తెలిపారు.

వార్షికోత్సవాలకు ముస్తాబైన ఆలయాలు



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని పలు ఆలయాలు వార్షికోత్సవ వేడుకలకు ముస్తాబయ్యాయి. సోమవారం వసంత పంచమి సందర్భంగా పట్టణంలోని సాయిబాబా ఆలయంలో 21వ వార్షికోత్సవాలకు ముస్తాబు కాగా, అయ్యప్ప ఆలయంలో 9వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించేందుకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కిటకిటలాడిన భక్తులు



మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు కిటకిటలాడారు. ఒడి బియ్యం, పుట్టు వెంట్రుకలు ఇతర శుభ కార్యాలు నిర్వహించారు.

నేడు మార్కండేయ విగ్రహ ప్రతిష్ఠాపన

లింగంపేట(ఎల్లారెడ్డి): వసంత పంచమి సందర్భంగా మండల కేంద్రంలోని వెంకటభాజా ఆశ్రమం ప్రక్కన తోపుగుట్టపై భక్త మార్కండేయ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సం నిర్వహించనున్నట్లు పద్మశాలి సంఘం అధ్యక్షుడు పారిపల్లి సంతోష్ తెలిపారు. ఉదయం 6 గంటలకు విగ్రహ ఊరేగింపు, 8 గంటలకు ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహిస్తామన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): వసంత పంచమిని పురస్కరించుకొని గోపాల్‌పేటలోని వేణుగోపాలస్వామి ఆలయం పక్కన ఉన్న ఖాళీ స్థలంలో అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి సోమవారం భూమిపూజ నిర్వహించనున్నట్లు అయ్యప్ప సేవాసమితి సభ్యులు తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి ఆలయనిర్మాణానికి చేపట్టే భూమిపూజలో పాల్గొనాలని వారు కోరారు.

చెట్ల కిందే చదువులు

- మన ఊరు- మన బడి పథకంలో పూర్తికాని తరగతి గదుల నిర్మాణం
- నత్తనడకన కొనసాగుతున్న పనులు
- ఇబ్బందులు పడుతున్న జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు



చెట్ల కింద చదువుకుంటున్న జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మన ఊరు- మన బడి పథకం కింద పాఠశాలకు నిధులు మంజూరైనా దానికి సంబంధించిన పనులు ఇంత వరకు పూర్తి కాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. చెట్ల కింద, వరండాలో చదువుకోవాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు గత ఏడాది పథకం కింద రూ.కోటి నిధులను అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. దీనికి సంబంధించిన నిధులతో పాఠశాలలో ఆరు తరగతి గదుల నిర్మాణంతో పాటు, కిచెన్, డైనింగ్ హాల్, మైనర్, మేజర్ రిపేరు పనులకు సంబంధించి నిధులు మంజూరు కావడంతో శిథిలావస్థకు చేరిన తరగతి గదులను కూల్చి వేసి వాటి స్థానంలో నూతనంగా తరగతి గదుల నిర్మాణం పనులు చేపట్టారు. పనులు ప్రారంభించి ఏడాది పూర్తయినా ఇంత వరకు తరగతి గదులకు సంబంధించి స్లాబు మాత్రమే వేశారు. విద్యార్థులకు చెట్లు, కంప్యూటర్ గది, సైన్స్‌ల్యాబ్, స్టోర్‌రూం, నూతనంగా నిర్మించిన తరగతి గదుల స్లాబ్ కింద పాఠాలను బోధిస్తున్నారు. వర్షం కురిస్తే ఇంకా పరిస్థితి ఘోరంగా తయారవుతుందని వారు ఆందోళన చెందుతున్నారు. పాఠశాలలో 300 మంది విద్యార్థులకు సరిపడా గదులు లేక ఇబ్బందులు పడుతుంటే అదే ఆవరణలో ప్రాథమిక పాఠశాల నిర్వహించడం.. వారు సైతం ఒకే గదిలో 5 తరగతులు నిర్వహించడం ఇబ్బందిగా మారిందని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తరగతి గదుల నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

వరండాలోనే చదువుకుంటున్నాం..



వరండాలోనే పాఠాలు చదువుకుంటున్నాం. పాఠశాలలో సరిపడా తరగతి గదులు లేక ఇబ్బందులు పడుతున్నాం. తరగతి గదుల నిర్మాణం పూర్తయితే ఇబ్బందులు ఉండవు.

– బ్రహ్మం, 6వ తరగతి, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, ఎల్లారెడ్డి

సైన్స్ ల్యాబ్‌లో తరగతులు



పాఠశాలలో తరగతి గదుల నిర్మాణం పనులు పూర్తి కాకపోవడంతో చెట్ల కింద, సైన్స్ ల్యాబ్, వరండాలో, స్టోర్ రూంలలో తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో ఇబ్బందులు పడుతున్నాం.

– సిద్ధు, 7వ తరగతి, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, ఎల్లారెడ్డి





స్లాబు కింద పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయులు

పర్యవేక్షణ కరువు.. నాణ్యతకు పాతర



నిర్మాణ పనులలో వాడిన బొడిగ రాయి



పోచారం గ్రామానికి వెళ్లే దారిలో నిర్మిస్తున్న కల్వర్టు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని పోచారం గ్రామానికి వెళ్లే వాగుపై రూ.5 లక్షలతో నిర్మిస్తున్న కల్వర్టు నిర్మాణ పనులు నాసిరకంగా సాగుతున్నాయి. కల్వర్టు నిర్మాణానికి కాంక్రీట్‌కు బదులు బోడిగె రాయి(సుమారు 4, 5 కేజీల రాళ్లు) వాడుతున్నారు. అలాగే నాసిరకం తూములు వాడుతున్నారు. నిర్మాణ పనుల్లో లూజు మట్టి తీయకుండా.. నీరు తోడకుండా కాంక్రీట్ పనులు చేస్తున్నారు. అధికారులు స్పందించి నాణ్యతా ప్రమాణాలతో కల్వర్టు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై పెద్దకొడప్‌గల్ డిప్యూటీ ఏఈ మధుబాబును 'సాక్షి' వివరణ కోరగా.. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారని, మళ్లీ పరిశీలించి ఎలాంటి నాణ్యతా లోపం లేకుండా చూస్తామని చెప్పారు.

చెత్తను తొలగించరా సారూ..!



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణంలోని పలు కాలనీలలో ఉన్న చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. పట్టణంలోని వైశ్యభవన్, పోలీస్‌స్టేషన్ పక్కన గల స్థలాలలో చెత్త నిండడంతో దుర్గంధం వ్యాపించడంతో పాటు, ఈగలు దోమలు వృద్ధి చెందుతున్నాయని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి చెత్తను తొలగించాలని కోరుతున్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

లింగంపేట(ఎల్లారెడ్డి): వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు లింగంపేటలోని పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని మండల పార్టీ అధ్యక్షుడు నారాగౌడ్ తెలిపారు. రాంపల్లి తండాలో జగదాంబ మాత, సేవాలాల్ మహరాజ్ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు. సాయంత్రం 5 గంటలకు ఎల్లారెడ్డి క్యాంపు కార్యాలయంలో లింగంపేట మండల కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

పీఎంశ్రీ నిధులతో విజ్ఞాన యాత్ర



రామప్ప దేవాలయంలో బొల్లారం హైస్కూల్ విద్యార్థులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): బొల్లారం హైస్కూల్ విద్యార్థులు ఆదివారం విజ్ఞాన విహారయాత్రకు వెళ్లారు. పీఎంశ్రీ ద్వారా మంజూరైన నిధులతో పాఠశాల విద్యార్థులను విహారయాత్రకు తీసుకెళ్లినట్లు ఇన్‌చార్జి హెచ్ఎం బాలాజీ తెలిపారు. విహారయాత్రలో భాగంగా పాఠశాల విద్యార్థులను వరంగల్ జిల్లాలోని రామప్ప దేవాలయం, భద్రాచలంలోని కోదండ రామాలయం గుడికి కూడా తీసుకెళ్లినట్లు చెప్పారు. ఇన్‌చార్జి ఎంఈవో భాస్కర్‌రెడ్డి, ఇంచార్జ్ హెచ్ఎంతోపాటు పాఠశాల ఉపాధ్యాయులు సుకుమార్‌గౌడ్, రజిత, చందర్, షకీలొద్దీన్, వనిత తదితరులు వెళ్లారు.

ఆధ్యాత్మికం..

సరస్వతి మాత విగ్రహ ప్రతిష్ఠాపన



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండలంలోని సింగితం గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం చదువుల తల్లి జ్ఞాన సరస్వతి మాత విగ్రహ ప్రతిష్ఠాపన వైభవోపేతంగా నిర్వహించారు. వేద పండితుడు మురళీధర్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

శివలింగేశ్వర ఆలయ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని విద్యుత్‌నగర్‌లోని మంగళగౌరీ సమేత మరకత శివలింగేశ్వర ఆలయంలో ఈ నెల 8, 9, 10 తేదీల్లో ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు, గాయత్రి, విద్యుత్ నగర్ కాలనీల ప్రతినిధులు తెలిపారు.

దేవతామూర్తుల విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): బెజుగంచెరువుతండాలో



మూడు రోజులుగా జరుగుతున్న సంత్ సేవాలాల్ మహరాజ్, జగదాంబ మాత విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలలో భాగంగా ఆదివారం దేవతామూర్తుల విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం చేపట్టారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పురోహితులు శివకుమార్‌శర్మ, పూజారి కిషన్‌నాయక్, మందిరం అధ్యక్షుడు బాబునాయక్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.50 వేల విరాళం..

బెజుగంచెరువుతండాలో నూతనంగా నిర్మించిన సేవాలాల్ మహారాజ్, బగదాంబ మాత ఆలయం వద్ద జరుగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలకు బీజేపీ నేత పైడి ఎల్లారెడ్డి హాజరయ్యారు. ఆలయ అభివృద్ధి కోసం ఆయన రూ.50 వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను తండా వాసులు సత్కరించారు. బీజేపీ నాయకులు దేవిసింగ్, భాస్కర్, కిషన్ తదితరులున్నారు.

నల్లమడుగు పెద్దతండాలో..



లింగంపేట(ఎల్లారెడ్డి): నల్లమడుగు పెద్ద తండాలో జగదాంబ, సేవాలాల్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే సురేందర్‌కు తండావాసులు కృతజ్ఞతలు తెలిపారు.

సైబర్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలి

- ఎస్సై పుష్ప రాజ్



అవగాహన కల్పిస్తున్న ఎస్సై పుష్పరాజ్

రాజంపేట : సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాజంపేట్ ఎస్సై పుష్పరాజ్ సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ మోసాల బారిన పడకుండా ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తికి రూ.2 లక్షలు సైబర్ మోసం బారిన పడి మోసపోయాడన్నారు. అపరిచితులకు ఓటీపీలు చెప్పవద్దని, అనవసరమైన వెబ్‌సైట్లు, లింకులు ఓపెన్ చేయకూడదని సూచించారు. అదే విధంగా మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడపాలన్నారు.

అడుగంటుతున్న చెరువులు

-వేసవి ప్రారంభం కాకముందే చెరువులు ఖాళీ



రామారెడ్డిలో పూర్తిగా అడుగంటిన చింతలకుంట చెరువు

రామారెడ్డి: వేసవి ప్రారంభంలోనే చెరువులు అడుగంటుతున్నాయి. గత వర్ష కాలంలో చివరి నెలలో కురిసిన భారీ వర్షాలకు జలకళతో ఉన్న చెరువులు జనవరి నుంచే నీళ్లు అడగంటడం ప్రారంభించాయి. రామారెడ్డి మండలంలో పెద్ద చెరువులుగా పేరుగాంచిన ఇసన్నపల్లె చెరువు, చింతలకుంట చెరువులు పూర్తిగా ఎండు ముఖం పట్టాయి. ఎండల తీవ్రత మరింత పెరిగితే చెరువు పక్కన వ్యవసాయ బావులపై ఆధారపడి పంటలు పండిస్తున్న రైతులు ఇబ్బందులు పడాల్సిందే. బోర్లు ఎత్తిపోయడం ఇప్పటి నుంచే ప్రారంభమైంది.

యువత క్రీడలపై దృష్టిసారించాలి

- తెలంగాణ స్టేట్ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్



బహుమతులు అందజేస్తున్న కాసుల బాలరాజ్

బాన్సువాడ రూరల్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలపై దృష్టి సారించాలని తెలంగాణ స్టేట్ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ అన్నారు. ఇబ్రహీంపేట్ గ్రామానికి సుదీర్ఘకాలం సర్పంచ్‌గా పనిచేసిన దివంగత ఉద్దెర గంగప్ప వర్ధంతి సందర్భంగా యువకులకు నిర్వహించిన కబడ్డీ, వాలీబాల్ తదితర క్రీడాపోటీలల్లో గెలుపొందిన వారికి ట్రోఫీ, నగదు బహుమతులు అందజేసి మాట్లాడారు. క్రీడలతో శారీరకంగా దృఢంగా ఉండటంతో పాటు, మానసికం ఉల్లాసం, స్నేహభావం పెంపొందుతుందన్నారు. అలాగే ఆర్టీసీ బస్‌డిపో సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన పరివార్ రెస్టారెంట్‌ను ఆయన ప్రారంభించారు. నిర్వాహకులు కళావతి హన్మాండ్లు, నాయకులు కృష్ణారెడ్డి, ఖాలేక్, ఎజాస్, సురేష్ గుప్తా, రోహిత్, నారాయణరెడ్డి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక ప్రదర్శనను విజయవంతం చేయండి



బాన్సువాడలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

బాన్సువాడ రూరల్: ఈనెల 7న ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించే సాంస్కృతిక ప్రదర్శనను విజయవంతం చేయాలని బాన్సువాడలో మాదిగలు, ఉపకులాలకు చెందిన నాయకులు కోరారు. ఈమేరకు వారు సన్నాహక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. 7న ఉదయం 8గంటల లోపు వివిధ గ్రామాల నుంచి మాదిగలు, ఇతర ఉపకులాల ప్రజలు బాన్సువాడ అంబేడ్కర్ చౌరస్తాకు చేరుకోవాలన్నారు. అక్కడ డప్పు దరువు, డీజే నృత్యాలతో ర్యాలీగా హైదరాబాద్ బయలు దేరుతారని తెలిపారు. అనంతరం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. నేతలు ఎర్రవాటి పోశీరాం, మోచి గణేశ్, అంబిల్‌పూరి రాజు, ఎడ్ల గంగారాం, తదితరులు పాల్గొన్నారు.



మాచారెడ్డిలో ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

మాచారెడ్డి: మాచారెడ్డిలో లక్ష డప్పులు- వేల గొంతుల కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను ఆదివారం ఎమ్మార్పీఎస్ నాయకులు ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బట్ట వెంకటరాములు, నాయకులు గడ్డం బాబు, నాలపురం సురేష్, దేవరాజ్, అరవింద్, రాజెల్లం, సురేష్, మహిపాల్, శ్రీనివాస్, రమేష్, నాగరాజ్ ఉన్నారు.

పైపులైన్ల లీకేజీలను అరికట్టరూ..!

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండలంలోని నర్వ గ్రామంలో రక్షిత మంచి నీటి ట్యాంకు వద్ద పైపులైన్ల లీకేజీలతో తాగు నీరు వృథాగా పోతోంది. ట్యాంకు నుంచి ఇంటింటికి నీటిని సరఫరా చేసే ప్రధాన పైపులైన్ పగిలి పోయింది. నాలుగైదు రోజుల నుంచి తాగు నీరు కలుషితం కావడంతో పాటు నీరు వృథా అవుతుందని కాలనీ ప్రజలు వాపోతున్నారు. అధికారులు ఇకనైనా స్పందించి పైపులైన్ల లీకేజీలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.



లీకేజీలతో వృథా అవుతున్న తాగు నీరు

ప్రకృతి వనం..వికృత రూపం



కాద్లాపూర్‌లో వాడిపోయిన మొక్కలతో దర్శనమిస్తున్న ప్రకృతి వనం

బాన్సువాడ రూరల్ : పట్టణ ప్రజలకు మాత్రమే పరిమితమైన పచ్చని పార్కులు పల్లె పల్లెలోనూ ఉండాలనే సదుద్దేశంతో ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేసింది. కాని కొన్ని గ్రామాల్లో కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కారణంగా మొక్కలకు సరైన విధంగా నీటి సౌకర్యం కల్పించలేదు. దీంతో ప్రకృతి వనాల్లోని మొక్కలు మానులై ఎండిపోతున్నాయి. పచ్చని ప్రకృతి ప్రదేశంలో వికృత రూపం కనపడుతోంది. అధికారులు స్పందించి పల్లె ప్రకృతి వనాల్లోని మొక్కలను కాపాడి ప్రజలకు ఆహ్లాదాన్ని కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

దేవునిపల్లి కురుమ యువ చైతన్య సమితి కార్యవర్గం



కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని దేవునిపల్లి గ్రామ కురుమ యువ చైతన్య సమితి(కేవైసీఏ)నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు మామిడి సంజీవ్ కుర్మ ఆధ్వర్యంలో జిల్లా ఉపాధ్యక్షుడు పెద్దొళ్ల మహేష్, న్యాయ సలహాదారుడు చెట్కూరి గంగారాజం పరవేక్షణలో ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాగల్ల రాజయ్య, ఉపాధ్యక్షులుగా ఒగ్గు నర్సింలు, కార్యనిర్వాహక అధ్యక్షుడుగా చెట్కూరి రవి, ప్రధాన కార్యదర్శిగా బుల్లె శ్రీశైలం, కార్యదర్శిగా దకాల మహిపాల్, కోశాధికారిగా మచ్చ గంగాధర్, ప్రచార కార్యదర్శిగా దొడ్లె రమేష్, సలహాదారులుగా చిందం మల్లేష్, దర్శపు భాస్కర్‌లు ఎన్నికయ్యారు.